# దాగుడుమూతలు

యాత్ర పూర్తిచేసుకొని ఊరికి తిరిగి వస్తుండగా మా ఆవిడ ఒక చిత్రమైన కోరిక బయటపెట్టింది. ఏం లేదు. మార్గ మధ్యంలో ప్రయాణం ఆపుచెయ్యాలి. ఒకానొక పట్టణంలో కొద్ది గంటలసేపు మజిలీ వెయ్యాలి. ఇంతజేసీ అదొక పుణ్య స్థలమేమీ గాదు. అక్కడ చూడదగ్గ విశేషాలు గూడా లేవు. ఏ పనిచేసినా దానికొక అర్థం వుండాలి. మా ఆవిడయినా ఉద్దేశ రహితంగా ఈ నిర్ణయాని వచ్చివుండదని నా నమ్మకం. కానీ తన అంతర్యమేమిటో చెప్పదు. దిగాలి, దిగుదామని మాత్రం అంటుంది. నాతో దాగుడుమూత లాడడమంటే భలే సరదా మా రాజ్యానికి!

సరే దిగాము. హోటలు గదిలో స్నాన పానాదులు ముగించి, కొంతసేపు సేద దీరిన తర్వాత రాజ్యం పైకి లేచి పెట్టె తెరిచింది. ఆ ముస్తాబవుతున్న వాలకాన్నిబట్టి చూస్తే బయటికి వెళ్ళడానికి ఆయత్తమయ్యే సూచనలు కానవస్తున్నాయి. సూచనలేంకర్మ! కాసేపటికి చెప్పనే చెప్పేసింది. "అలా తెల్లబోయి చూస్తూ కూచున్నారేమండీ! లేవండి, వెళ్ళొచ్చేద్దాం."

కళ్ళకు గంతలు కట్టించుకుని యింతదూరం వచ్చేశాక, యిప్పుడిక ఎక్కడికని ఎలా అడగ్గలను? నా లోలోపల ఆత్మాభిమానం బుసలుకొడుతోంది. అయినా బయటపడి పోవడానికి మనస్కరించక "నే నెందుకూ! నువ్వెళ్ళి రారాదా రాజ్యం! ఇరవై అయిదేళ్ళు కాపురం చేసినవాణ్ణి. ఇప్పు డీ వూళ్ళో నిన్ను దిగవిడిచి వెళ్ళిపోతానా? ఏం భయపడొద్దు. నీకోసం యిక్కడే వేచి వుంటాను" అన్నాను.

నా కోపం అవధులు దాటుతూ వుందని రాజ్యం చప్పున గ్రహించేసింది. తన నయగారాల విద్యకు ఉపక్రమణికగా నా వైపు ఓరకంటితో చూస్తూ "బాబ్బాబూ! నన్ను ముప్పు తిప్పలు పెట్టకండి! అస లేం జరిగిందో చెప్పేస్తాను" అంటూ కదిలివచ్చి నా ఎదుట కుర్చీలో ఆసీనురాలైంది.

"చెప్పు" అన్నాను ముక్తసరిగా.

"పదేళ్ళ క్రితం...ఒక నాడు..."

"ఉండుండు. ఇలాంటి ఘట్టాల్లో విధిగా వాతావరణ వర్ణన చెయ్యాలి. ఆ నా డాకాశం వినీల జలధర ప్లావితమై

వుందని చెప్పు. లేదా ఎండలు విచ్చుకత్తుల్లా మెరుస్తున్నాయని చెప్పు. కాదా చలిగాలులు ఎముకల్ని కొరికేస్తున్నాయని చెప్పు."

"అబ్బ. వూరుకుందురూ!" ప్రాధేయపడింది రాజ్యం. "ఆరోజలాంటి అవాంతరా లేం లేవు లెండి! ప్రశాంతంగానే తెల్లవారింది. భోజనంచేసి మీ రాఫీసుకు వెళ్ళడానికి తయారౌతున్నారు. మీకు జ్ఞాపకముందో లేదో, అప్పుడు నేనొక ప్రశ్న వేశాను."

ఆలోచించడం వృథా ప్రయాస. రాజ్యం రోజుకు వంద ప్రశ్నలయినా అడుగుతుంది. టేపుపైన రికార్డు చేసి పెట్టుకుంటే గానీ వాటిని పునశ్చరణ చేసుకునే అవకాశం లేదు.

"ఏమంత గహనమైన ప్రశ్న గాదు. మీ పుట్టిన తేదీ చెప్పమన్నాను. అడిగిన ప్రశ్నకు సజావుగా సమాధానం చెప్పే అలవాటు హఠాత్తుగా రమ్మంటే వస్తుందా! ఎందుకో చెప్ప మన్నారు మీరు. ఎందుకో చెబితే మీ రసలు చెప్పనే చెప్పరని నాకు తెలుసు. ఎలాగో మీచేత చెప్పించాను. ఆ తరువాత అలాంటిదే ఇంకొక ప్రశ్న. మీ జన్మ నక్షత్ర మేమిటి అని!"

"కొంపదీసి చెప్పేశానా ఏమిటి!" నా కుతూహలంలో నాకు ఊపిరాడడం లేదు.

"మీరు చెప్పారనడం సబబు గాదు. నేనే చెప్పించు కున్నాను." రాజ్యం చివాలున పైకి లేచి మళ్ళీ పెట్టెదగ్గరికి వెళ్ళింది. అట్టడుగునుంచి ఓ చీటీ ముక్క పైకి తీసింది. మడతలు విప్పుకుంటూ వచ్చి, దాన్ని నా చేతిలో పెట్టింది.

పదేళ్ళ క్రిందటి వార్తాపత్రికలోనుంచి పదిలంగా చించి పెట్టుకున్న ఆ కాగితంముక్కలో ఓ ప్రకటన మాత్రమే వుంది. "పుట్టిన తారీఖు, జన్మనక్షత్రం తెల్పుతూ రు. 5 మనియార్డరు చేస్తే మీరు కోరిన మూడు ప్రశ్నలకు సమాధానం వ్రాసి పంపబడును."

ప్రకటన క్రింద కానవచ్చిన దైవజ్ఞుడి చిరునామా చూడ గానే నా కళ్ళ కడ్డంగా ఉన్న గంత కొంచెంగా విచ్చుకున్న ట్టయింది. ఆయనగారుండడం ఈ వూళ్ళోనే!

"త్రిప్పి చూడండి. నేను కోరిన ప్రశ్నలు గూడా అందు లోనే ఉన్నాయి" అంది రాజ్యం.

త్రిప్పి చూచాను. పాతబడి పోవడంవల్ల ఆ పెన్సిల్ వ్రాత సరిగ్గా కంటి కానడంలేదు. కూడి, కూడి చదువుకోగలి గాను. ఒకటి ప్రమోష నెప్పుడు వస్తుంది? రెండు నాలుగై దేళ్ళలోగా స్వంత యిల్లు కట్టుకోగలమా? మూడు ఈ జాత కుడికి విదేశ యాత్రలకు వెళ్ళే యోగముందా?

అయిదు రూపాయల సంభావనతో దైవజ్ఞుడికి పంపుకో బడ్డ ప్రశ్నలు! వాటి వైపు చూస్తుంటే రాజ్యం అమాయ కత్వానికి నవ్వాలో ఏడవాలో తోచడంలేదు.

"చూడు రాజ్యం! ఈ మాత్రం ప్రశ్నలకు జ్యోతి ష్కుడిదాకా వెళ్ళవలసిన అవసరం లేదు. నన్నడిగి వున్నట్టయితే సమాధానం చెప్పేవాణ్ణే! ఒళ్ళు దాచుకోకుండా ఉద్యోగం చేసేవాడికి ప్రమోషననేది ఎప్పుడో ఒకప్పుడు రానే వస్తుంది. దుబారా చేయకుండా రాబడిలో ఎంతో కొంత దాచిపెట్టుకునే

వాడు తన స్థాయికి తగ్గట్టు ఒక ఇల్లు కట్టుకోవడం గూడా అసాధ్యమేమీ గాదు. ఏటొచ్చీ, ఈ మూడో ప్రశ్న దగ్గరే వస్తుంది చిక్కు. నీ జ్యోతిష్కుడు గూడా ఇక్కడ పప్పులో కాలువేసి వుంటాడనే నా వూహ!"

"అదేం లేదు. అచ్చు గుద్దినట్టు ఆయన నికరంగానే చెప్పేశాడు. విదేశ యాత్రల మాట చెప్పడానికి లేదు. దేశ యాత్ర చేయడం మాత్రం ఖాయం అని!"

"ఆ జాతక ఫలం మేరకు మన కిప్పుడీ యాత్రా యోగం పట్టిందన్న మాట! అవునా రాజ్యం?"

"బాబూ! ఎవరి నమ్మకాలు వాళ్ళవి! మీ కెందుకూ; మీరు నాతో రండి! అడగవలసిన ప్రశ్న లేవో నే నడుక్కుంటాను. మీతో చెప్పగూడని ప్రశ్నలేం కావులెండి. మరేం లేదు. అమ్మాయి పెళ్ళిని గురించి, అబ్బాయి ఉద్యోగాన్ని గురించి..."

ఇంతదూరం వచ్చాక ఇక తప్పేముంది? సరే, బయ ల్దేరమన్నాను.

గదికి తాళం వేసి రోడ్డుపై కొచ్చాము. పేవ్‌మెంటుపైన నిలబడి రిక్షాకోసం చూస్తూండగా అడిగింది రాజ్యం.

"అన్నట్టు మీ పుట్టిన తారీఖున్నూ, జన్మ లగ్నమున్నూ జ్ఞాపక మున్నాయటండీ?"

హఠాత్తుగా వెనుకనుంచి నా తలపైన ఎవరో బలంగా మోదినట్టయింది. నీళ్ళు నములుతున్నానే గానీ మాట పెకలడంలేదు.

"చెప్పరే మండీ!"

"అబ్బే, చెప్పలేకేం రాజ్యం! పుట్టిన తేదీ పదహారు, మార్చి, ఇరవై నాలుగు. నక్షత్రం మృగశిరనుకుంటాను..."

"మృగశిరటండీ మీ జన్మనక్షత్రం? వాలకం చూడగానే తెలిసిపోడంలా! మీ రేదో బుకాయిస్తున్నారు. వుండండి, ఇప్పుడే వచ్చేస్తాను..."

హుటా హుటిగా మళ్ళీ హోటల్లోకి దారితీసింది రాజ్యం. దోషిలా మెల్లగా ఆమెను వెంబడించాను.

గది తలుపులు తెరిచి యింకా టేబిలుపైన పడివున్న కవరులోనుంచి యింకొక కాగితంముక్క పైకి తీసింది.

"అదిగో! నేనా మరిచిపోయేదాన్ని! మఖా నక్షత్రం మీది! అదేమిటండీ, పుట్టిన తేదీ గూడా యిప్పుడు మీరు చెప్పింది కాదే!"

"చిచ్చుబుడ్డీలా మండిపడకపోతే చెబుతాను రాజ్యం! నేనిప్పుడు చెప్పిం దెంత నిజమో, అప్పుడు చెప్పింది గూడా అంతే నిజం! నిజానికి మా నాన్నగారు నా పుట్టుకను గురించిన వివరాలేవీ రాసిపెట్టలేదు. ఆ మాటకొస్తే పెళ్ళి సంబంధం చూచుకున్నప్పుడు మీ నాన్నగారికి అల్లాటప్పా జాతకమే! తప్పొయన్ది, నాది గాదు."

గాలి తీసేసిన బెలూనులా రాజ్యం కుర్చీలో కూలిపోయింది!